# ఎక్కడయితేనేం

విజయ మనసు చాలా ఆనందంగా వుంది. ఇవాళ, రేపు గడిస్తే, ఎల్లుండి ప్రయాణం. రెండే రోజులు, అక్కడుండేవి రెండే రోజులు పెట్టి సర్దటానికి కూచున్న విజయకి నవ్వొచ్చింది ఎందుకో. ఏం సర్దాలి? ఓ మూడు చీరలు, స్నానం చేశాక తల ఆరటానికి తల తుడుచుకొనే తువ్వాళ్ళు. ఇంకా పసుపు కుంకుమ పేకట్లు. అయినా ఎన్ని రోజులుంటా మక్కడ, రెండు రోజులు!! ఆ, విజయ డ్రస్సింగ్ టేబుల్ దగ్గర కొచ్చింది. ఎర్రని, ఆకుపచ్చని గాజులు తీసి ఒకటొకటీ రెండు చేతుల నిండా ఎక్కించుకుంది. రిస్టు వాచీ గాజుల పెట్టిలో పడేసింది. అయినా రెండు రోజుల ప్రయాణానికి ఇంతముందుగా హడావిడి ఏమిటో? తను తన స్నేహితురాళ్ళు కలసి విజయవాడ బయలుదేరుతున్నారు కృష్ణా పుష్కరాలకి. అసలు తను రైలు ఎక్కి ఎన్ని రోజులయిందీ, రోజు లేమిటి ఎన్ని ఏళ్ళయింది?

ముందు గదిలోకొచ్చి ఫోన్ చేసింది ఫ్రెండు లలితకి. ఆ కబుర్లు ఈ కబుర్లు అయ్యాక, బావగారొస్తున్నారా అంది లలిత. “ఆయన రారట, ఆ పుణ్యం నన్నే సంపాదించుకోమన్నారు” అంది విజయ. మళ్ళీ ఫోను చేస్తానంటూ రిసీవర్ పెట్టేసింది. విజయ మాట్లాడుతున్నంత సేపూ

అక్కడే నిల్చున్నాడు నవీన్, విజయ పెద్దకొడుకు. "అయిందా మమ్మీ! ఎంతసేపైనా సోది కబుర్లు చెప్పుకుంటారేం? నాకు ఫోను కావాలి. అర్జంటుగా మా ఫ్రెండుకి ఫోన్ చెయ్యాలి."

"చేసుకో. అయినా ఒక్కసారి ఫోను దగ్గరకి నేను వచ్చేసరికి అందరికీ అప్పుడే దాంతోటి అవసరం. కృష్ణా పుష్కరాలకి విజయవాడ వెడుతున్నారు కదా అని లలితకి ఫోన్ చేశాను" విజయ చిరాగ్గా లోపల కెళ్ళింది.

కాలింగ్ బెల్ మోగింది. పక్కింటి రాము. రోజూ వచ్చి పేపరు తిరగేసి, సినిమాలు ఎక్కడ ఏ టైములో ఆడుతున్నాయో తెలుసుకుని మరీ వెళతాడు.

"ఒరేయ్ రామూ! కృష్ణా పుష్కరాలకి వెడుతున్నాం. మీ అమ్మ కూడా వస్తుందేమో కనుక్కో." విజయ మాటలు వింటూనే, సినిమాల పేర్లు చదువుతూ "అమ్మరాదు ఆంటీ" అన్నాడు రాము పేపరులోంచి తల తీయకుండానే.

"నువ్వే చెప్పేస్తున్నావే రాదని. పుష్కర స్నానం ఎంత పుణ్యమో తెలుసా" అంది విజయ.

"ఆ! లక్షల లక్షల జనం. ముందు టీకాలు వేయించుకోండి మీరంతా. అయినా ఆ సందడిలో రౌడీమూకలు, దొంగలు. ఆంటీ! అమ్మ వెడతానంటే మేమంతా వద్దని మాన్పించేశాము."

విజయకి చాలా కోపమొచ్చింది ఆ మాటలకి. "అయినా మీరెవరూ మాన్పించటానికి? ఆ లక్షల లక్షల జనంలో మీ అమ్మ, నేను ఎక్కువ కాములే" అంది కోపంగా విజయ.

పేపరులో సినిమాల వివరాలు తెలుసుకొని, పేపరు కింద పెట్టి వెళ్ళిపోయాడు రాము.

* * *

విజయకి కాలం నడుస్తున్నట్లనిపించలేదు. "అబ్బా! ఇంకా ఏడు

గంటలేనా?" అంది గడియారం వంక చూస్తూ. ఆ పనీ ఈ పనీ పూర్తి చేసుకుంది. ఈ కృష్ణానదీ స్నానం గురించే ఆలోచిస్తూ పనులు గబగబా పూర్తి చేసుకుంది.

భోజనం తొమ్మిదయేసరికి చేసి నిద్రపోయింది విజయ. ఫోను మోగుతుంది.

"మమ్మీ! నీకే."

"ఇప్పుడెవరురా?" విసుగ్గా లేచింది విజయ.

పుష్కరాలకి జాగ్రత్తగా వెళ్ళిరమ్మని, గట్టున నిలబడే రెండు చెంబులు తలపై దిమ్మరించుకు రమ్మని, ఆరోగ్యం జాగ్రత్తనీ హెచ్చరించింది పిన్ని. అంతతో ఆగక, నువ్వు రెండు రోజులు వెడితే ఇల్లెలాగా అంది. మీ ఆయన కూడా వస్తే బాగుండేదిగా అంది. పిన్ని ఇంకా ఏదో చెప్తూనే వుంది. విజయ ఫోను పెట్టేసింది. ఫోను మళ్ళీ మోగింది, మళ్ళీ మోగింది. విజయ వినిపించుకోలేదు.

అసలు తను రెండు రోజులకి పుష్కరాల కోసం వెడుతుంటే ఇంతమంది ఇంత గోల ఏమిటీ!! ఏం, పురిటి వంకని పుట్టింటికెళ్ళి, ఆర్నెల్లు రాకపోతే ఇల్లు జాగ్రత్తగా చూసుకునే మగాళ్ళు లేరా? వంట చేసుకుని, ఉద్యోగం చేసుకుంటూ, ఇల్లు చూసుకునే భర్తలు లేరా! నా ఫ్రెండు ఈమధ్య ఆర్నెల్లు విదేశాలకెళ్ళి వచ్చింది, ప్రభుత్వం పంపిస్తే ఆమె భర్తకానీ, చుట్టాలుకానీ, పిల్లలుకానీ ఇలాగే గోల పెట్టారా!! అదేమిటో రెండు రోజులు, రెండే రోజులు తను ఇల్లు వదిలి వెడతానంటే అదీ సరదాకీ కాదు, పెత్తనాలకీ కాదు, పుష్కర స్నానానికి. ఇంత గొడవేమిటీ!! అసలు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. అక్కడికెడితే కలరా వస్తుందంటాడు పెద్ద కొడుకు. నన్నడుగుతే వెళ్ళడం అనవసరం, నీ యిష్టం. అయినా నువ్వు ఆరోగ్యం శ్రద్ధ వట్టించుకోవు. అదీ నా భయం. అందుకు వెళ్ళొద్దంటున్నా! నీ యిష్టం అంటాడు. వెళ్ళొద్దు అని నోటితో అనకుండా లౌక్యంగా తన భర్త. అతను రాకుండా నువ్వెందుకెళ్ళటం

అంటుంది పిన్ని. ఛీ! ఎవరేమన్నా అననీ! తను ఖచ్చితంగా వెడుతుంది. వెళ్ళి తీరుతుంది. టిక్కట్టు దగ్గరనుంచీ బుక్ చేసుకున్నాక వెళ్ళకపోవట మేమిటి? విజయ మనసుని సమాధానపరచుకుంది. రేపొక్క రోజు గడిస్తే ఎల్లుండి ప్రయాణం!!

మంచి నిద్రలో మునిగిపోయింది విజయ. అబ్బ ఎంతమంది జనం. లక్షల లక్షలు. పిల్ల పాప, చిన్న, పెద్ద, ఆడ, మగ, ఏమి జన ప్రవాహం. అదిగో అదిగో వచ్చేసింది కృష్ణమ్మ. అబ్బ! ఏమి అందం. ఆ చిరునవ్వులో ఎంత నిర్మలత్వం. కాళ్ళ అందెలు, గజ్జెలు ఎంత మధురంగా ధ్వని చేస్తున్నాయి పుష్కర స్నానం మళ్ళా, మళ్ళా, మళ్ళా చేస్తూనేవుంది విజయ. పాదాలనిండా పసుపు, నుదుట కుంకుమ. అదేమిటి కృష్ణవేణమ్మ తన పక్కనే కూచుంది. తననే పిలుస్తోంది. తన చేయి పట్టుకు జాగ్రత్తగా ఒడ్డుకి తెస్తోంది. భయం లేదులే! భుజం తడుతోంది. ఆ! తన జన్మ ధన్యం. కలలో పరవశించిపోయింది విజయ.

"అవును! రేపు - రేపు వస్తున్నాను" గట్టిగా అరిచింది.

"విజ్జీ! ఏమిటీ, ఎవరితో మాట్లాడుతున్నావ్?" రామం విజయని కదిలించాడు.

"విజ్జీ! నిద్రలే!"

విజయ అటు తిరిగి మళ్ళీ నిద్రలో మునిగిపోయింది.

రామానికి నిద్ర పట్టటంలేదు.

పక్కనే గాఢనిద్రలో వుంది విజయ. అలా చూశాడు ఒక్క నిముషం. ఉన్న వయసు కనబడకుండా ఆరోగ్యంగా నిండుగా వున్న విజయను చూస్తున్నాడు రామం కన్నార్పకుండగ. పిచ్చి విజయ! ఓర్పుతో, నేర్పుతో ఈ సంసార సాగరాన్ని ఈదుతోన్న విజయ! ఎందుకో ఒక్కసారి జాలేసింది. నిన్న రాత్రి తనకొచ్చిన ఫోను విషయం ఇప్పుడు చెప్పాలా వద్దా! కానీ, అప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలో విజయే తీసు

కుంటుంది అంతే!! నుదుట ఎర్రటి కుంకుమ, మెడమీద చిందరవందరగా జారిన నల్లని జడపాయలు. రామం విజయ బుగ్గల్ని ముద్దుపెట్టుకున్నాడు.

ఉలిక్కిపడింది విజయ. "లే! తెల్లారుతోంది" విజయ అటు వత్తిగిల్లింది.

తెల్లారకుండా అంత తొందరగా ఎందుకు లేవాలో రామానికి తెలుసు, విజయంకేం తెలుసూ?

కాలింగ్‌బెల్ మోగటం ఆలస్యంగా మంచం మీద నుంచి ఒక్క దూకు దూకాడు రామం. రామం సంతోషం పట్టలేకుండా వున్నాడు. మనవల్ని చూసి ఏడాది దాటిపోయింది. కళ్ళు కాయలు కాసిపోయాయి. అందులో కవల పిల్లలు, మగపిల్లలు, గడుగ్గాయిలు. రెండేళ్ళది ఆడపిల్ల. ఈ ముగ్గురు పిల్లలతో సతమత మవుతూ ఉంటుంది చిట్టితల్లి. అల్లుడికి నెలలో సగం రోజులు టూరు. మరి అతని ఉద్యోగమే అంత. రామం పిల్లల వంక, చిట్టితల్లి వంక చూస్తున్నాడు.

సందడికి నిద్ర లేచింది విజయ. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

"ఫోను చెయ్యలేక పోయావా?" అంది మనుమరాలిని ఒళ్ళోకి తీసుకుంటూ, భర్తవైపు చూస్తూనే, చిట్టితల్లి వైపు తిరిగి.

"ఫోను చేశానుగా" చిట్టితల్లి తండ్రి వంక చూసింది.

"ఆ, అదేనూ" అర్థం కాకుండా ఏదో నసిగి, మనుమరాలిని ఒళ్ళో కూచోపెట్టుకున్నాడు.

"ఇదిగో అమ్మా! ఈ పిల్లలు నిన్ను ఇబ్బంది పెట్టకుండా, నాతో మా పని పిల్లని కూడా తెచ్చాను" అంది చిట్టితల్లి, పక్కన చిన్న గౌను తొడుక్కు నిలబడ్డ లక్ష్మిని చూపిస్తూ.

ఏమిటో అర్థం కాలేదు విజయకి.

"ఉండు నేను చెపుతా" అన్నాడు చైతన్య అత్తగారివైపు తిరుగుతూ "ఆంటీ! నేను మీ అమ్మాయి రేపు పొద్దున్నే కృష్ణా పుష్కరాలకి విజయవాడ వెడుతున్నాం. మా ఫ్రెండు కారు తెచ్చాడు. అతని పిల్లల్ని వాళ్ళ

అత్తగారింట్లో, మా పిల్లల్ని మా అత్తగారింట్లో దింపి, మేము నలుగురం విజయవాడ వెళ్ళి వచ్చేయాలని అనుకున్నాం.

"రేపు పొద్దున్నా .... కృష్ణా పుష్కరాలకా" అంది వెంటనే విజయ.

"ఆ! ఒక్క రెండు రోజుల్లో వచ్చేస్తాం. పిల్లలు మీదగ్గరుంటే మాకు ధైర్యం. అక్కడకి తీసుకెడితే ఆ నీళ్లు, అవి పడక – అయినా ఆ లక్షల లక్షల జనాల మధ్య పిల్లలు ఇబ్బంది పడిపోతారు" చైతన్య అంటుంటే,

"పైగా మమ్మీ! మనుమల్ని చూస్తా తీసుకురా, ఒక్కసారి తీసుకు రా! అని నాన్న ఈ మధ్య తెగ ఫోన్లు మాకు...." అంది చిట్టితల్లి.

విజయ భర్త వైపు చూస్తూ ఊరుకుంది. రామం, విజయ చూపులు తప్పించుకుని ఎటో చూస్తున్నాడు.

"అమ్మమ్మా! మీ యింట్లో వి. సి. ఆర్. లో "క్షణ క్షణం" చూస్తా. నేను మూడుసార్లు చూసా. కానీ ఇంకా రెండుసార్లు చూస్తానని నా ఫ్రెండుకి చెప్పా. అమ్మమ్మా! మీ ఇంటి దగ్గర వీడియో క్లబ్బులేదా?" రెండో క్లాసులో కొచ్చిన కృష్ణచైతన్య అంటుంటే విజయ సమాధానం చెప్పకుండా ఎటో చూస్తూ, ఏదో ఆలోచనలో మునిగిపోయింది.

"నేను తెచ్చి పెడతాగా నీకు. మనింటి ఎదురుగుండానే షాపు. నీకు కావలసినన్ని కాసెట్లు తెచ్చి పెడతా. హాయిగా మనం సినిమా చూద్దాం, జూకి వెడదాం" రామం పిల్లల్లో పిల్లవాడయిపోయి మాట్లాడు తుంటే, విజయ కోపం కళ్ళల్లో పట్టటంలేదు. బుగ్గల్లోకి, ముక్కులోకి పాకి అవి ఎర్రగా కందిపోయాయి. చెవుల కెంపుల దుద్దులు మరీ ఎర్రగా కనిపించాయి ఆ క్షణం.

"నాకు సెలవ దొరకటమే కష్టమండీ, ఎలాగో ఓ వారం రోజులు సెలవు పెట్టాను. రెండు రోజులు విజయవాడ, నాలుగు రోజులు మీకు

గారింట్లో విందు భోజనాలు, అవునా చిట్టీ!" బూట్లు విప్పుకుంటూ అల్లుడు చైతన్య అంటూంటే_

"అవునోయ్, అందుకేగా నేనూ ఆఫీసుకి సెలవు పంపించేసాను. నిన్ననే వారం రోజులు రానని...." అన్నాడు ఉత్సాహంగా రామం.

"నిన్నా!" అంది విజయ వెంటనే "అదేలే నిన్నంటే- అదే, రేపు" రామం విజయ వంక చూడకుండానే అన్నాడు ఖంగారుగా.

నీళ్ళ గదిలోకెళ్ళిన విజయకి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. కృష్ణా పుష్కర స్నానం చేయలేకపోయాను కదా! కృష్ణవేణమ్మ నన్ను క్షమిస్తుందా?" కళ్ళు గట్టిగా మూసుకుంది.

స్నానం చేయటం మొదలు పెట్టింది. మనసులో ఎంతో బాధగా ఉంది. నేనూ వస్తాను అంటే ఈ పిల్లల్నెవరు చూస్తారు? మీరు వుండండి. నేను వెడతాను అంటే చిట్టితల్లి మనసు కష్టపెట్టుకోదూ! విజయ గబ గబా నీళ్ళు చెంబులు చెంబులు నెత్తి మీద పోసుకుంది. ఇదే పుష్కర స్నానం. ఏం చేస్తాను, ఇంతే! అందుకే పెద్దవాళ్లు చెపుతారు - ప్రాప్త ముండాలని -

విజయ పసుపు రాసుకున్న పాదాలు ఆ నీళ్ళలో తడిసి ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. నల్లని జుట్టు బాగా తడిసి తమాషాగా మెరుస్తోంది. అయ్యో! ఈ స్నానం కృష్ణానదిలో చేస్తే నా జన్మ ధన్య మయేది కాదా!" విజయ అలా స్నానంచేస్తూనే వుంది. ఎంతసేపు, ఎంత సేపు – ఎంతసేపో!!

"ఇదీ పుష్కర స్నానమే! కృష్ణా పుష్కరాల పండగకి రాలేదని కదూ నీ బాధ! ఈ నీళ్ళలో నేను లేనా?

"నేను అన్ని నీళ్ళలోనూవున్నా! ఇక్కడే వున్నా -ఈ నీళ్ళలోనూ నేనే! అంతటా నేనే" ఏదో గొంతు గుండెకి వినిపిస్తోంది. చెంబుల చెంబుల నీళ్ళు నెత్తి మీద దిమ్మరించుకుంటోంది విజయ,

"ఈ భవసాగరాలు ఈది రాలేవని, నేనే వచ్చా నీ కోసం" విజయ చెవులకి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. కళ్ళు గట్టిగా మూసుకుంది. అదే రూపం! అదే నవ్వు! కాలి అందెల గజ్జెల రవళి! అదే కృష్ణమ్మ! విజయ అప్రయత్నంగా నమస్కరించి అటూ ఇటూ చూసింది.

విజయ మనసెంతో ఒక్కసారి తేలికయిపోయింది. కళ్ళలో బరువు లేదు, మనసులో బాధ లేదు.

విజయ నల్లని పొడుగాటి జుట్టు ఆరబెట్టుకుంటూ తులసి తోట గుమ్మంలో కూచుంది. తన స్నేహితులు ప్రయాణపు హడావిడిలో వుండి వుంటారు. ఉంటే నాకేం? నా పుష్కర స్నానం అయిపోయింది. ఎక్కడయితేనేం!!

ఈ పిల్లల్ని చూసుకోటానికి నేను లేనా? నన్ను చూసుకోటానికి కృష్ణమ్మ లేదా అంతా మనసులోనే వుంది, ఇంకేం కావాలి తనకి? విజయ తడిగావున్న జుట్టు పాయలు పాయలుగా తీసుకుంది.

వీధిలో కారు ఆగింది. హోటల్ నుంచి వచ్చిన పిల్లలు "నీకోసం" అంటూ బ్రేక్‌ఫాస్టు పేకట్లు అందించారు.

అమ్మాయి చిట్టీ! పిల్లల గురించి బెంగపడకండి.

ఒక్క మాట, నా పేరున కృష్ణమ్మకి దణ్ణం పెట్టండి! ఎక్కడయితే నేం? విజయ నవ్వుతూ మాట్లాడుతుంటే విస్తుపోయి ఆమెవంక చూస్తుండి పోయాడు రామం. విజయ నవ్వుతూ హాయిగా మాట్లాడుతూ మనుమరాలిని ఒళ్ళో కూచో పెట్టుకుంది.